

నారాయణ సేవకు ఏర్పాటు చేసిన కౌంటర్లు

ఆధ్యాత్మిక సంబరం

నేటి నుంచి సత్యసాయిబాబా జయంత్యుత్సవాలు

● వేణుగోపాలస్వామి రథోత్సవంతో ప్రారంభం ● భక్తుల నారాయణసేవకు ఏర్పాట్లు



శోభాయమానంగా పుట్టపర్తి వీధులు

సత్యసాయిబాబా జయంత్యుత్సవాల నేపథ్యంలో పుట్టపర్తి వీధులు విద్యుద్దీపకాంతులతో మిరుమిట్లు గొలుపుతున్నాయి. ప్రశాంతి నిలయం, సాయికుల్వంత్ సభామండపాలను ప్రత్యేకంగా అలంకరించారు. మామిడి తోరణాలు కట్టారు.



సత్యసాయి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న ఆర్జే రత్నాకర్

పుట్టపర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తికి పండగొచ్చింది. సత్యసాయిబాబా 99 జయంత్యుత్సవాలకు వేళయింది. సోమవారం వేడుకలు ప్రారంభంకానున్నాయి. దీంతో పట్టణమంతా విద్యుద్దీప కాంతులతో వెలుగొందుతోంది. ప్రశాంతినిలయంలో సత్య సాయి సెంట్రల్ ట్రస్టు వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాయి. సోమవారం వేణుగోపాలస్వామి రథోత్సవంతో వేడుకలు ప్రారంభంకానున్నాయి. ఈనెల 24వ తేదీ వరకు కొనసాగనున్నాయి. భక్తులకు 18 నుంచి 24వ తేదీ వరకు నారాయణసేవ అందించడానికి ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేశారు. 19న అంతర్జాతీయ మహిళా దినోత్సవం, 20, 21, సత్యసాయి సేవాసంస్థల సదస్సులు, 22న శ్రీసత్యసాయియూనివర్సిటీ స్నాతకోత్సవం, 23న సాయి కుల్వంత్ సభామండపంలో సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాలు నిర్వహిస్తారు. వేడుకల్లో పాల్గొనే భక్తుల కోసం ప్రశాంతి నిలయంలో 18నుండి 25 వరకు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు నారాయణసేవ అందించనున్నారు. వంటలు చేయడానికి ప్రత్యేక గదిని ఏర్పాటుచేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్.. సత్యసాయిబాబా చిత్రపటం వద్ద ఆదివారం పూజలు చేసి, పొయ్యి వెలిగించి భోజనాలు వండే కార్యక్రమాన్ని ప్రారంభించారు.



విద్యుద్దీపాలంకరణలో గణేష్‌గేట్

నాడు-నేడు

చోద్యం చూడు..!

గత వైసీపీ పాలనలో అడ్డగోలు నిర్ణయాలు

- పాఠశాల గదులు కూల్చివేత
- కొత్తగా ఒక గది నిర్మాణానికి చర్యలు
- పునాదులతో సరి
- ఆర్డీటీ హాల్‌లో విద్యార్థుల చదువులు
- ఐదు తరగతులూ అక్కడే..



ఆర్డీటీ హాల్‌లో కొనసాగుతున్న తరగతులు

తనకల్లు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకులు.. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తామంటూ ఆర్భాటపు ప్రకటనలు చేశారు. అన్ని కోట్లిచ్చాం.. ఇన్ని కోట్లిచ్చాం.. అంటూ ఐదేళ్లు ప్రగల్భాలు పలికారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అడ్డగోలు నిర్ణయాలు, అర్థంలేని చర్యలతో పాఠశాల విద్యను చిన్నాభిన్నం చేశారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. అందుకు నిదర్శనం తనకల్లు మండలంలోని ఎర్రగుట్టపల్లి ప్రాథమిక పాఠశాల. గతంలో స్కూల్‌లో రెండు తరగతి గదులుండేవి. అందులో 25 మంది విద్యార్థులు చదువుకుంటుండేవారు. తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయంటూ గత వైసీపీ హయాంలో వాటిని కూల్చేశారు. ఐదేళ్లలో కొత్త గదులు మాత్రం నిర్మించలేకపోయారు. ఓ గది నిర్మాణం చేపట్టారు. దానిని కూడా పునాది దశలోనే ఆపేశారు. చిత్రమేమిటంటే తరగతి గది నిర్మాణం పూర్తికాకనే బల్లలు, తలుపులు, ఫ్యాన్లు సరఫరా చేశారు. వాటిని ఎక్కడ ఉంచుకోవాలో అర్థంకాని పరిస్థితి. బల్లలు మాత్రం ఉపయోగిస్తున్నారు. మిగతావి ఎక్కడున్నాయో కూడా తెలీదు. వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో పాఠశాల లేకుండా పోయింది. ఐదు తరగతుల విద్యార్థులు ఆర్డీటీ హాల్‌లో చదువుకుంటున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. అందరూ ఒకే హాల్‌లో కూర్చుంటుండడంతో ఎవరికి ఎవరు పాఠం చెబుతున్నారో అర్థంకాక అయోమయానికి లోనవుతున్నారు. పాఠాలు అర్థంకాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

పునాది వేసి.. వదిలేశారు..

ఎర్రగుట్టపల్లి ప్రాథమక పాఠశాలలో 25మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఐదేళ్లుగా పాఠశాలకు భవనం లేదు. ఇదేదో కొత్తగా మంజూరైన పాఠశాల కాదు. గతంలో నిర్మించిన రెండు గదులను కూల్చేశారు. కొత్తవి నిర్మించకపోవడంతో ఐదేళ్లుగా గ్రామంలో ఆర్డీటీ నిర్మించిన కమ్యూనిటీ హాల్‌లోనే చదువులు కొనసాగుతున్నాయి. ఎర్రగుట్టపల్లిలో పాఠశాలకు భవనాలు నాడు-నేడు మొదటి విడతలో మంజూరు కాలేదు. దీంతో ఐదు తరగతులను ఇద్దరు ఉపాధ్యాయులు ఒకేహాల్‌లో నిర్వహిస్తున్నారు. ఈకారణంగా ఏ ఉపాధ్యాయుడు ఏమి చెబుతున్నాడో అర్థంకాక విద్యార్థులు అయోమయానికి లోనవుతున్నారు. రెండో విడత నాడు-నేడులో ఓ తరగతి గదిని మంజూరుచేసి, రూ.2.78 లక్షలు నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో ఒక తరగతి గదికి పునాది మాత్రమే నిర్మించారు. పాఠశాల భవనం పూర్తికాకనే లాభసాటిగా ఉండే వస్తువులకు టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు.. బల్లలు, ఫ్యాన్లు, వాటర్ ప్లాంటు, మరుగుదొడ్ల తలుపులు పంపారు. వీటిని భద్రపరచడానికి ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పాఠశాలను పునర్నిర్మించాలని గ్రామస్థులు పదే పదే అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి వెంటనే పాఠశాలకు భవనాలను పునర్నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంతా ఆర్భాటమే



నాడు-నేడు పేరుతో గత ప్రభుత్వం అంతా ఆర్భాటం చేసింది. అవసరమైన చోట గదుల నిర్మాణాలు చేపట్టలేదు. పునాదులు వేసి, వదిలేశారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే లేడు. భవన నిర్మాణాలు పూర్తికాకనే ఫ్యాన్లు, తలుపులు, బల్లలు ఎందుకు సరఫరా చేశారో?

- రెడ్డెప్ప, ఎర్రగుట్టపల్లి

ఐదేళ్లుగా అడుగుతున్నాం



గ్రామంలో కూలిపోయిన నూతన పాఠశాల గదులను నిర్మించాలని ఐదేళ్లుగా అడుగుతున్నాం. మా పిల్లలు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నారు. ఒకే గదిలో ఇటు కొంతమంది, అటు కొంతమంది కూర్చుని, ఇద్దరు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు వినాల్సి వస్తోంది. ఫలితంగా విద్యార్థులకు ఏ ఉపాధ్యాయుడు ఏమి చెబుతున్నారో అర్థం కాక, ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే పాఠశాల నూతన గదుల నిర్మాణం చేపట్టి, సమస్యను పరిష్కరించాలి.

- వెంకటరమణ, ఎర్రగుట్టపల్లి



పునాదికే పరిమితమైన పాఠశాల గది

నిధులు వస్తే పనులు కొనసాగిస్తాం

ఎర్రగుట్టపల్లి పాఠశాలకు రూ.2.78లక్షల నిధులు మంజూరయ్యాయి. వాటితో పునాదులు వేశాం. పిల్లర్ల నిర్మాణానికి స్టీల్ కొనుగోలు చేశాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే భవన నిర్మాణాలు కొనసాగిస్తాం.

- రషీద్, ఇంజనీర్

సై అంటే సై

పెనుకొండ వైసీపీలో వర్గపోరు

రోడ్డెక్కుతున్న ఉషశ్రీ, శంకర్‌నారాయణ వర్గీయులు



హిందూపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అడ్డగోలుగా వ్యవహరించిన నాయకుల కారణంగా కిందిస్థాయి క్యాడర్‌లో అసమ్మతి ఏర్పడి వర్గపోరు మొదలైన విషయం తెలిసిందే. వైసీపీ ఘోరపరాజయం చెందడానికి ఇదికూడా కారణమని చెప్పవచ్చు. ఘోరంగా ఓడిపోయినా, ప్రతిపక్షహోదా కూడా దక్కకపోయినా ఆ పార్టీలో అసమ్మతి సెగమాత్రం తగ్గడంలేదు. ఇప్పటికీ అధికారంలో ఉన్నట్లుగానే నియోజకవర్గ వైసీపీలో వర్గపోరు సాగుతూనే ఉంది. ఎంతగా అంటే ఒకవర్గం నాయకుడిని తమ ఊరిలోకి రానిచ్చేదిలేదని మరో వర్గం హెచ్చరించేస్థాయికి చేరింది. నియోజకవర్గానికి ఐదేళ్ల వైసీపీపాలనలో ఇద్దరు ఇన్‌చార్జిలు మారినా పార్టీ క్యాడర్ మాత్రం ఏకతాటిపైకి రాలేదు. ముఖ్యనేతలు ఒకే సామాజిక వర్గానికి చెందినవారైనా ఫలితం లేకుండాపోయింది.

ఏడాదికే శంకర్‌నారాయణకు సెగ

జిల్లాలో 2019 ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గం నుంచి మాలగుండ్ల శంకర్‌నారాయణ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మంత్రి పదవి కూడా దక్కించుకున్నారు. అధిష్టానం మార్కులు కొట్టేసినా కిందిస్థాయి కార్యకర్తల్లో మాత్రం అసమ్మతి తప్పలేదు. ఈకారణంగా రెండున్నరేళ్లకే మంత్రి పదవి ఊడిపోయింది. 2019ఎన్నికల్లో మంచి మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ సమయంలో నియోజకవర్గంలో శంకర్‌నారాయణ చెప్పిందే ఆపార్టీ నాయకులు, కార్యకర్తలకు వేదం. అధికారంలోకి వచ్చిన ఏడాదికే నియోజకవర్గంలోని మండలాల్లో ఆయన సోదరులు పెత్తనం సాగించడం, వైసీపీకి బలమైన సామాజికవర్గంలోని నాయకులను పక్కనపెట్టడం, కేసులు పెట్టించడంతో అసమ్మతిసెగ రాజుకుంది. మంత్రిగా ఉన్నపుడే ఆయన వద్దంటూ మంత్రి పదవి నుంచి తొలగించాలని సొంత పార్టీ వారే ధర్నాలు చేశారు. అసమ్మతి సెగ రోజు రోజుకు అధికమై ఆయనకు తలనొప్పిగా మారింది. ఒకానొక దశలో అప్పటిమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వస్తుండగా ఆయన కాన్వాయిపైకి చెప్పులు విసిరిన సంఘటన చోటుచేసుకుంది. అంతేకాక సోమందేపల్లి మండలంలో కార్యక్రమానికి వెళ్తున్న శంకర్‌నారాయణ వాహనంపై చెప్పులు విసిరారు. దీంతో ఆయన మరింత రెచ్చిపోయి కొంతమందిసొంత పార్టీ నాయకులపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించినట్లు అప్పట్లో ఆరోపణలు చేశారు. ఈ కారణంగానే శంకర్‌నారాయణకు వ్యతిరేక వర్గం రోజురోజుకీ బలపడి ఎన్నికల ముందు ఆయనను తప్పించి, అనంతపురం పార్లమెంట్‌కు పంపారు. కళ్యాణదుర్గంలో మంత్రిగా ఉన్న అదే సామాజికవర్గానికి చెందిన ఉశశ్రీని పెనుకొండకు ఎన్నికల ముందు పంపారు. ఆమె పెనుకొండకు వచ్చినా వైసీపీలో వర్గపోరు మాత్రం తగ్గలేదు. అప్పటి వరకు శంకర్ నారాయణకు వ్యతిరేకంగా ఉన్నవర్గం ఉషశ్రీ వైపు చేరింది. శంకర్‌నారాయణ వర్గం మాత్రం అలాగే ఉంది. దీంతో ఎన్నికలపుడు కూడా ఏకతాటిపైకి వచ్చి పార్టీ గెలుపునకు కృషిచేయలేదని ఒకవర్గం అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ప్రతిపక్షంలో ఉన్నా తగ్గని వైనం

2024 ఎన్నికల్లో పెనుకొండ నుంచి పోటీచేసిన ఉషశ్రీ, అనంతపురం పార్లమెంట్‌కు పోటీచేసిన శంకర్‌నారాయణ ఘోరంగా ఓడిపోయారు. ఆ తరువాత కూడా పెనుకొండ నియోజవకర్గంలో వారి వర్గాలు మాత్రం అలాగే ఉన్నాయి. శంకర్‌నారాయణ పెనుకొండ బాధ్యతలు కావాలని పట్టుబట్టినట్లు తెలిసింది. అయినా ఆ పార్టీలో ఓ కీలకనేత అండతో ఉషశ్రీకే పెనుకొండ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడంతోపాటు జిల్లా అధ్యక్ష పగ్గాలు కూడా అప్పగించారు. దీంతో శంకర్‌నారాయణ వర్గం జీర్ణించుకోలేకపోతోంది. ఈ పరిస్థితుల్లో శంకర్‌నారాయణ అప్పుడప్పుడు నియోజకవర్గంలోని ఆయన వర్గీయుల కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఇది ఉషశ్రీ వర్గానికి మింగుడు పడటంలేదు. ఆయనను నియోజకవర్గంలోకి రానీయకుండా ఉషశ్రీ వర్గంలోని ముఖ్యనేతలు ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈకారణంగా గోరంట్లలో ఉషశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె వర్గీయులు శంకర్‌నారాయణపై ఆరోపణలు చేసినా స్పందించలేదు. దీనినిబట్టి వర్గపోరు అధికారం కోల్పోయినా కొనసాగుతున్నట్లు స్పష్టం అవుతోంది.

ఊర్లోకి రానిచ్చేదిలేదంటూ హెచ్చరికలు

ఇటీవల కార్యకర్తలు, నాయకుల సమావేశాల్లో ఒకవర్గం నేతను మరో వర్గంవారు తమ ఊర్లోకి రానిచ్చేదిలేదనీ, వస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు జారీచేస్తున్నారు. శనివారం గోరంట్లలో సమావేశమైన ఉషశ్రీ వర్గీయులు మాట్లాడుతూ.. గోరంట్ల మండలంలో గ్రూపురాజకీయాలు ప్రోత్సహించడానికి శంకర్‌నారాయణ ప్రయత్నిస్తున్నారనీ, దీంతో ఆయన గోరంట్లకు వస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆయన పార్టీ నాశనానికి కంకణం కట్టుకున్నాడని విమర్శలు గుప్పించారు. అదే మండలంలో ఉన్న కొంతమంది శంకర్‌నారాయణ వర్గీయులు మాత్రం పార్టీ అధికారం కోల్పోయినా ఉషశ్రీ మాత్రం అధికారంలో లేకపోయినా పార్టీని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో కాకుండా వర్గపోరుకు ఆజ్యం పోస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. ఒకరిపై ఒకరు నేతలను రానిచ్చేదిలేదంటూ విమర్శలు గుప్పిస్తూ, ఆ పార్టీ నాయకులు బజారుకెక్కడంతో పెనుకొండ వైసీపీలో వర్గపోరు తగ్గడం లేదని తెలుస్తోంది.

పరస్పర ఆరోపణలు

శంకర్‌నారాయణ, ఉషశ్రీ వర్గీయులు పరస్పరం ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. గత వైసీపీ హయాంలో వారి నాయకులు చేసిన దందాలు, అఘాయిత్యాలు, దౌర్జన్యాలను పరస్పరం నిందించుకుంటున్నారు. ఇటీవల గోరంట్ల మండలంలో ఉషశ్రీ సమక్షంలోనే శంకర్‌నారాయణ కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు చేస్తున్నా నోరు మెదపకపోవడం, ఇదే సమయంలో కొన్నిరోజుల క్రితం పెనుకొండలో నిర్వహించిన రహస్య సమావేశంలో శంకర్‌నారాయణ వర్గీయులు ఉషశ్రీ వర్గంపై కళ్యాణదుర్గంలో ఆమె చేసిన భూదందాలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులపై ఆరోపణలు గుప్పించారు. అంతేకాకుండా శంకర్‌నారాయణ వర్గంలో ఉండి ఎన్నికల ముందు టీడీపీలో చేరిన ఓ కార్యకర్త నాలుగు రోజుల క్రితం పోలీసు స్టేషన్‌లోనే ఆయననే నిలదీశాడు.

'నీవు చెప్పిన విధంగానే దాడులు చేశామనీ, ఆఖరుకు పాత్రికేయులను కూడా కొట్టామనీ, తద్వారా కేసుల్లో ఇరుక్కున్నామ'ని శంకర్‌నారాయణ వద్ద వాపోయాడు. దీనిని బట్టి గత వైసీపీ హయాంలో శంకర్‌నారాయణ కొంతమంది నాయకులు, కార్యకర్తలను ఉసిగొలిపి ప్రతిపక్ష పార్టీలతోపాటు గిట్టనివారిపై చేయించిన అఘాయిత్యాలు, దాడులు ఒక్కొక్కటే వెలుగు చూస్తున్నాయి.

గోవిందా.. గోవింద..



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి

హిందూపురం అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధిచెందిన పురాతన శ్రీ గుడ్డం రంగనాథస్వామి బ్రహ్మోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. మూడు రోజులుగా హోమాలు, కల్యాణోత్సవం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి మూల విరాట్‌కు అభిషేకాలు, అర్చనలు చేశారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి ఉత్సవ మూర్తులను రథంలో అధిరోహింపజేసి, గిరి ప్రదక్షిణ గావించారు. గోవిందనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో ఈఓ నాగేంద్రుడు, అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రంగనాథస్వామి రథోత్సవం..



తలపడుతున్న కర్ణాటక, తమిళనాడు జట్ల ఆటగాళ్లు

గోల్..నిల్..!

పోరాడకుండా ఓడిన ఆంధ్రా జట్టు

- అండమాన్ సునాయాస గెలుపు
- రసవత్తరంగా తమిళనాడు-కర్ణాటక మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆతిథ్య జట్టుపై ఉన్న భారీ అంచనాలు పటాపంచలయ్యాయి. అండమాన్ నికోబర్‌తో జరిగిన మ్యాచ్‌లో పోరాడకుండానే ఆంధ్రా జట్టు ఓటమిపాలైంది. ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో సంతోష్‌ట్రోఫీ ఫుట్‌బాల్ నేషనల్ పోటీలు నిర్వహించారు. ఉదయం ఆంధ్రప్రదేశ్, అండమాన్ నికోబర్ జట్ల మధ్య జరిగింది. మొదటి నుంచి ఎటువంటి పోరాట పటిమ ప్రదర్శించని ఏపీ జట్టు అండమాన్‌పై గోల్ తేడాతో ఓటమి పాలైంది. దీంతో ఆంధ్రా జట్టు రెండో ఓటమిని మూటగట్టుకుంది. అండమాన్ ప్లేయర్ గీతన్ రాజ్ చేసిన ఒకే ఒక్క గోల్‌తో గెలుపుసొంతం చేసుకుంది. మరో మ్యాచ్ మధ్యాహ్నం తమిళనాడు, కర్ణాటక జట్లు తలపడగా రసవత్తరంగా సాగింది. నువ్వా నేనా అన్న చందంగా గెలుపు అటుఇటూ నడిచింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో కర్ణాటక జట్టులోని ప్లేయర్లు నిఖిల్‌రాజ్ ఒక గోల్ కొట్టాడు. తమిళనాడు జట్టులో లిజో, శరణ్ చెరో గోల్ కొట్టి జట్టును విజయతీరాలకు నడిపించారు. దీంతో తమిళనాడు రెండో విజయాన్ని నమోదు చేసింది.



ఆంధ్రా-అండమాన్ నికోబర్ జట్ల మధ్య పోరు



విజయం తరువాత ఆంధ్రా ఆటగాళ్లను ఓదారుస్తున్న అండమాన్ క్రీడాకారులు

కబడ్డీలో ఉద్దేహాళ్ జట్టుదే విజయం



కబడ్డీలో ప్రథమ బహుమతి పొందిన ఉద్దేహాలు జట్టు

విడపనకల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో బొమ్మనహాల్ మండలం ఉద్దేహాళ్ జట్టు గెలుపొందిందినట్లు ఉరవకొండ సీఐ చిన్నగౌస్, పాల్తూరు ఎస్ఐ మురహరిబాబు తెలిపారు. శనివారం ఉదయం ఎస్పీ జగదీష్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పోటీలను పాల్తూరు మైత్రి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించగా 60 జట్లు పాల్గొన్నాయి. వీటిలో పాల్తూరు, ఉద్దేహాల్ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్ మ్యాచ్ ఆదివారం నిర్వహించారు. పాల్తూరు జట్టుపై ఉద్దేహాల్ జట్టు విజయం సాధించింది. మొదటి బహుమతిగా రూ.10వేలు గెలుచుకున్నాయి. రన్నరప్ పాల్తూరు జట్టు రూ.5వేలు గెలుపొందారు. అనంతరం విజేత జట్లకు షీల్డ్ బహూకరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సీఐ చిన్నగౌస్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఆరోగ్యంతోపాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జీవన శైలిని మార్చుకోవాలి అన్నారు. కార్యక్రమంలో పాల్తూరు పోలీస్ సిబ్బంది, టీడీపీ మండల నాయకులు గడ్డం మారయ్య, కాలువ మారయ్య, కుమారుస్వామి, గంగన్న, వన్నూరు స్వామి పాల్గొన్నారు.

1 నుంచి పీఏబీఆర్
కుడికాలువకు నీటి విడుదల

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువకు డిసెంబరు 1వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. సెప్టెంబరు 19వ తేదీన నిర్వహించిన ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు (ఐఏబీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఐఏబీ చైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్ ఈ మేరకు అప్రూవల్ చేశారని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాతో పాటు శింగనమల, ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 33 చెరువులకు తుంగభద్ర జలాలను నింపుతామన్నారు. ఇందుకు కాలువ పరిసర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. నీటి సరఫరా సక్రమంగా సాగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్య సదస్సులతోనే పరిశోధనలకు పునాదులు

ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు



పెథాలజీ సదస్సులో జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టరు మాణిక్యాలరావు తదితరులు

అనంతపురంటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిత్య వైద్య సదస్సులతోనే నూతన వైద్యరంగాలకు పునాదులు పడతాయని మెడికల్‌కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు అన్నారు. ఆదివారం మెడికల్ కలాశాలలో చర్మవ్యాధి సమగ్ర విశ్లేషణపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన పరిశోధనలు, చికిత్సా పద్ధతులు, వ్యాధుల నివారణ పరిశోధనల ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. అందుకే వైద్యవిద్యార్థులు చదువుతో పాటు పరిశోధనలపైనా దృష్టి పెట్టాలని సూచించారు. క్రమం తప్పకుండా కళాశాలలోని ప్రతివిభాగం వైద్యులు నిరంతర వైద్యసదస్సులను నిర్వహించాలన్నారు. దీనివల్ల ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు ప్రపంచస్థాయి వైద్యపరిజ్ఞానం చేరువవుతుందన్నారు. అనంతరం విశ్వభారతి మెడికల్ కాలేజీ పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ నీరజ, సెయింట్‌జాన్స్ మెడికల్ కాలేజీ చర్మవ్యాధిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాజ్యలక్ష్మి, కుప్పం మెడికల్ కాలేజీ పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ ఏఎస్ రామస్వామి, శాంతిరామ్ మెడికల్ కాలేజీ పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ జానకి వివిధ రకాల చర్మవ్యాధులు ఎలాసంక్రమిస్తాయి, వాటిని ఎలా గుర్తించాలి, నివారణకు ఎలాంటి చికిత్సలు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంత వైద్య కలాశాల డాక్టర్లు శివశంకరనాయక్, లక్ష్మీ, శ్రీనివాసులు, సుమన్, భాగ్యలక్ష్మి, దివ్య, లక్ష్మి, దీప్తి, శ్రీధర్, చైతన్య, మల్లికాదేవి, మెడికోలు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ సేవల విస్తృతంపై ప్రత్యేక దృష్టి

రైతులకు సొసైటీల ద్వారా ఎరువుల విక్రయం

జాయింట్ కలెక్టర్, పర్సన్ ఇన్‌చార్జి శివనారాయణశర్మ



డీసీఎంఎస్ వివరాలు తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ ద్వారా రైతులకు ఉపయోగకరమైన సేవలను విస్తృతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయంలో జేసీ చేతుల మీదుగా సహకార పతాకాన్ని ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ డీసీఎంఎస్ పరిధి ఎంత, ఏయే ప్రాంతాల్లో ఏయే రకాల ఆస్తులు ఉన్నాయి, ఎంతమేర ఆదాయం వస్తోంది, ఎంత ఖర్చు చేస్తున్నారు, ఆదాయం-వ్యయం ఏ స్థాయిలో ఉందనే వివరాలపై ఆరా తీశారు. డీసీఎంఎస్‌లో వచ్చే ప్రతి పైసాకు లెక్క ఉండాలని, డీసీఎంఎస్ ఆవరణలో ఉన్న దుకాణాల అనుమతులు సక్రమంగా ఉండాలని సూచించారు. కాలానుగుణంగా డీసీఎంఎస్ సొసైటీల ద్వారా రైతులకు ఎరువుల విక్రయాలు, ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు తక్కువ ధరకు విక్రయించాలని సూచించారు. అనంతరం డీసీఎంఎస్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి, ఆర్‌సీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సబ్ డీఎల్‌సీఓ బాలగంగాధర్, సహకార విద్యాశాఖాధికారి మోహన్‌మురళీ, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయభాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, ఏఓ సుధాకర్ రెడ్డి, ఇఫ్‌కో ప్రతినిధి మణికళ్యాణ్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తిలో ట్రాఫిక్ మళ్లింపు

పుట్టపర్తిరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంత్యుత్సవాల్లో భాగంగా సోమవారం వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ రత్న ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తచెరువు, అనంతపురం, ధర్మవరం, గోరంట్ల బెంగళూరు వైపు నుంచి వచ్చే వాహనాలను గణేష్ సర్కిల్ నుంచి చిత్రావతి వైపు మళ్లించామన్నారు. నల్లమాడ, కదిరి వైపు నుంచి వాహనాలను కర్ణాటకనాగేపల్లి బ్రిడ్జి నుంచి గణేష్ కూడలి వైపు మళ్లించామన్నారు. 21 నుంచి 23వ తేదీ వరకు అనంతపురం, కొత్తచెరువు, బెంగళూరు, గోరంట్లవైపు నుంచి వచ్చే వాహనాలను సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్, బ్రాహ్మణపల్లి, ఎనుమలపల్లి, చిత్రావతి రింగ్‌రోడ్డు వైపు మళ్లిస్తామన్నారు. ట్రాఫిక్ మళ్లింపును సత్యసాయిబాబా భక్తులు, ప్రజలు గమనించాలని ఎస్పీ సూచించారు. ఇందుకు సంబంధించి 14 పోలీసు బృందాలతో హనుమాన్ టెంపుల్, ఎనుమలపల్లి వద్ద అవుట్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

కింద పడి మధ్యప్రదేశ్ యువకుడి మృతి



దిలీప్ సాకేత్ మృతదేహం

గుత్తిరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట సమీపంలో మద్యం మత్తులో కిందికి పడి మధ్యప్రదేశ్‌కు చెందిన దిలీప్ సాకేత్(22) అనే యువకుడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు కొత్తపేట వద్ద శివకృష్ణ కంస్ట్రక్షన్‌లో స్టోర్ లేబర్‌గా దిలీప్ సాకేత్ పనిచేస్తున్నారు. శనివారం రాత్రి మద్యంమత్తులో కొత్తపేట నుంచి ఫ్యాకరీ వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా కింద పడడంతో తోటి కూలీలు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నీటిమడుగులో పడి ఇద్దరు బాలికలకు అస్వస్థత



అస్వస్థతకు లోనైన సంగీత, పవిత్ర

గుమ్మఘట్ట, నవంబరు 17(ఆంధ్ర జ్యోతి): మండలలంలోని కలుగోడు గ్రామంలో ఆదివారం తల్లితో పాటు బట్టలు ఉతికేందుకు వేదవతి హగరికి వెళ్లి నీటి మడుగులో పడి ఇద్దరు బాలికలు అస్వస్థతకు గురయ్యారు. సమీపంలోని గ్రామస్థులు వారిని కాపాడి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గ్రామస్థులు కుటుంబసభ్యులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన దళిత హనుమంతు భార్య శృతి ఇద్దరి కూతుర్లు సంగీత, పవిత్రలకు ఆదివారం సెలవు కావడంతో హగరి నదిలో బట్టలు ఉతికేందుకు తీసుకెళ్లింది. అక్కడ నీటిమడుగులో సరదాగా ఈత కొడుతూ వారిద్దరూ నీట మునిగిపోయారు. తల్లి కూడా మడుగులో నీరు ఎక్కువగా ఉండడంతో కాపాడే ప్రయత్నంలో నీటిలో మునుగుతుండగా సమీపంలో ఉన్న గ్రామస్థులు అప్రమత్తమై వెంటనే తల్లికూతుర్లను బయటకు తీశారు. తల్లి క్షేమంగా ఉండగా కూతుళ్లు సంగీత, పవిత్ర అప్పటికే నీరు తాగి కడుపు ఉబ్బి స్పృహ కోల్పోయారు. వెంటనే కుటుంబసభ్యులు, గ్రామస్థులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. గుమ్మఘట్ట పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

శింగనమల నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నీటి తొట్టిలో పడి ఓ చిన్నారి మృతిచెందిన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. అనంతపురానికి చెందిన ప్రసాద్ ప్రసన్న దంపతులు కుమరుడు రోషన్ కుమార్ (3)తో కలిసి ఆదివారం స్థానిక చర్చిలో ప్రార్థనల కోసం వచ్చారు. తల్లిదండ్రులు చర్చిలో ప్రార్థనలు చేస్తుండగా చిన్నారి ఆడుకుంటూ చర్చి అవరణలో ఉన్న తొట్టిలో పడ్డాడు. అక్కడ ఉన్నవారు గమనించి చిన్నారిని బయటికి తీసి స్థానిక ఆసుప్రతికి తరలించారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆనంతరపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందాడు. శింగనమల ఎస్ఐ విచారించగా తొట్టిలో పడి చిన్నారి మృతి చెందిన మాట వాస్తవమని, అయితే తల్లిదండ్రులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే కేసులు: డీసీ



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

గుత్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని ఎమ్మార్పీ కన్నా అధిక రేట్లకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను ఆదివారం సాయంత్రం తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి అక్రమ మద్యం, నాటుసారా తయారీ అమ్మకాలు అరికట్టాలన్నారు. రెండు అంతకంటే ఎక్కువ కేసులు ఒక వ్యక్తి మీద నమోదు అయితే పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. పాతనేరస్థుల మీద ఒక సంవత్సర కాలానికి రూ.లక్ష పూచీకత్తు మీద బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే వారి మీద కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు గోపాల్, అస్లాంబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు 1084 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1084 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 987 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.583 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీకారులు

ఆధునిక జీవిత సంఘర్షణలకు ప్రతిబింబాలు ప్రగతి కథలు


యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు వినోదిని

అనంతపురం కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవిత సంఘర్షణలకు ప్రతిబింబాలు ప్రగతి కథలు అని యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ యం.వినోదిని అన్నారు. రచయిత్రి డాక్టర్ ప్రగతి రచించిన 'కొన్ని చీకట్లు... ఓ వెలుతురు' అనే కథా సంపుటి పరిచయ సభను ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించారు. కార్యక్రమానికి వినోదిని ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. అమ్మ మనసుతో ప్రగతి కథా సాహిత్య సృజన చేశారని, ఆధునిక జీవితంలోని సౌందర్యాన్ని, సంఘర్షణలను అక్షరబద్ధం చేశారన్నారు. కవి తూముచెర్ల రాజారామ్ మాట్లాడుతూ వ్యక్తిగత స్వేచ్ఛను గుర్తించాల్సిన అవసరాన్ని ఆధునిక సమాజంలో మనుషులు మరింత ఆధునికం కావాల్సిన సందర్భాలను ఈ కథలు వివరిస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అంకె శ్రీనివాస్, డాక్టర్ హెచ్ పల్లవి, చంద్రశేఖర శాస్త్రి, చిలుకూరి దీవెన, యమునారాణి, శేషగిరి నాయుడు, శోభామణి, హేమామాలిని, యాములపల్లి నర్సిరెడ్డి, డాక్టర్ రాధేయ, ఉప్పరపాటి వెంకటేశులు, సత్య బోస్, గోవిందరాజులు, తరిమెల అమర్నాథరెడ్డి, జెట్టి జైరామ్, టీవీ రెడ్డి పాల్గొన్నారు.

మహిళా సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి గ్రామం వద్దగల శాడిల్స్ కియ అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు రాజేశ్వరి ఆదివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆదే పరిశ్రమలో పనిచేస్తున్న సెక్యూరిటీ సూపర్ వైజర్ త్రివేదిలాల్‌నాయక్ వేధించడంతోపాటు దాడి చేశాడంటూ గోరంట్ల పోలీసు స్టేషన్‌లో రాజేశ్వరి ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేశారు. కార్మిక సంఘం నాయకులు ఆమెకు మద్దతుగా నిలిచారు. పరిశ్రమ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, న్యాయం చేయాలని పట్టుబట్టారు. ఈనేపథ్యంలో సూపర్‌వైజర్ త్రివేదిలాల్‌నాయక్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. రాజేశ్వరికి కూడా ఉద్వాసన పలకనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెందిన రాజేశ్వరి గోరంట్లలోని పులేరు రోడ్డులో విషం తాగి, ఆత్మహత్యకు యత్నించింది. అస్వస్థతుకు లోనైన ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుప్రతికి తీసుకొచ్చారు. మెరుగైన వైద్యం నిమిత్తం 108లో హిందూపురం తరలించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



ఆంజనేయులు (ఫైల్)

బుక్కరాయసముద్రం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొడరాళ్ల గ్రామంలో ఆదివారం రాత్రి రైతు ఆంజనేయులు (29) విద్యుదాఘాతంతో మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పొడరాళ్ల గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు తనకున్న ఐదెకరాల పొలంలో మొక్కజొన్న, దానిమ్మ పంటలు సాగు చేశాడు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో తోటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. తోటలో విద్యుత్ స్టార్టర్ పెట్టె ఆన్ కాలేదు. తోటి రైతులకు ఫోన్ చేసి సమస్యను తెలిపాడు. విద్యుత్ స్టార్టర్ పెట్టె మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అక్కడికక్కడే మరణించాడు. ఆంజనేయులకు భార్య అరుణ, ఇద్దరు పిల్లలున్నారు. ప్రమాదంపై బుక్కరాయసముద్రం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

పోలీసుల అదుపులో భార్య

కళ్యాణదుర్గం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీటీఆర్ పల్లి తండాలో పశ్చిమబెంగాల్‌కు చెందిన బీజయ్ సర్దార్ (35) అనుమానాస్పద స్థితిలో ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఇదే విషయమై అతడి భార్య గీతాబాయిని పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు తెలిసింది. బీజయ్ సర్దార్, గీతాబాయి ఇద్దరూ బెంగళూరులో కూలి పనులు చేసుకుంటుండేవారు. అక్కడ వారి మధ్య ప్రేమ ఏర్పడి, పెళ్లి చేసుకున్నారు. మూడేళ్ల క్రితం గీతాబాయి స్వగ్రామమైన పీటీఆర్ పల్లి తండాకు వచ్చారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో తాగుడుకు బానిసైన బీజయ్ సర్దార్ రోజూ గీతాబాయిని అనుమానిస్తూ వేధించేవాడు. ఆదివారం సాయంత్రం కూడా భార్యను మాటలతో వేధిస్తూ, ఘర్షణకు దిగాడు. ఈ నేపథ్యంలో అతడు శవమయ్యాడు. ఇతడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతిపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు.

పోలీసు ఫిర్యాదుల పరిష్కార వేదికకు
ఆధార్ తప్పనిసరి

AADHAAR

పుట్టపర్తిరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమానికి చ్చేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలని జిల్లా పోలీసు కార్యాలయం ఆదివారం ప్రకటనలో పేర్కొంది. ఈవిషయాన్ని ప్రజలందరూ గమనించాలని అందులో కోరారు.

బకాయిల సాధనకు ఉద్యమబాట

ఏపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు



మాట్లాడుతున్న జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసనాయక్

అనంతపురం విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగ బకాయిలు చెల్లించకుంటే ఉద్యమం తప్పదని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలు, మొండి బకాయిలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. చలనం లేకుండా వ్యవహరిస్తే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. డిసెంబర్ 16, 17 తేదీల్లో జిల్లా స్థాయిలో, జనవరిలో రాష్ట్ర స్థాయిలో పోరాటాలు, నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. రాష్ట్ర పూర్వపు ప్రధానకార్యదర్శి కులశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ- టీచర్ల సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్ ముందుంటుందన్నారు. 12వ పీఆర్సీకి సంబంధించి 30 శాతం ఐఆర్ సాధనకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, 117 జీవో రద్దుకు మండలాల్లో తీర్మానాలు చేయాలన్నారు. డిసెంబర్, జనవరిలో పోరాటాలకు సిద్ధంగా ఉండాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి మహ్మమద్ రఫీ, జిల్లా గౌరవాధ్యక్షుడు వరప్రసాద్, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, పూర్వపు అధ్యక్షులు రవీంద్ర, అదనపు కార్యదర్శి ఆంజనేయులు నాయక్, అశోక్‌నాయక్, వజీర్ బాషా, రామాంజనేయులు పాల్గొన్నారు.

'క్షుద్ర వజ్రం' ఖబడ్దార్: టీడీపీ



మాట్లడుతున్న టీడీపీ నాయకులు

కదిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్షుద్రపూజలు చేస్తూ పోలీసులకు పట్టుబడిన క్షుద్ర వజ్ర భాస్కర్‌రెడ్డి టీడీపీ జోలికొస్తే ఖబడ్దార్ అని ఆ పార్టీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్షుద్ర పూజలు చేసి, పోలీసులకు అడ్డంగా దొరికిన నీవు టీడీపీ నాయకుల గురించి మాట్లాడతావా అని ప్రశ్నించారు. క్షుద్ర పూజలు చేయడనికి కాకపోతే రాష్ట్రంలో ఇన్ని ప్రధాన దేవాలయాలుంటే అడవిలో ఉన్న ఆ దేవాలయానికి అర్ధరాత్రి ఎందుకెళ్లావని ప్రశ్నించారు. క్షుద్రపూజలు చేస్తున్న నిన్న స్థానిక గ్రామస్థులు అడ్డుకోలేదా అని ప్రశ్నించారు. నీ వ్యక్తిగత జీవితంతోపాటు రాజకీయ జీవితం కూడా ప్రజలకు తెలుసన్నారు. డబుల్ రిజిస్ట్రేషన్లు, చెల్లని చెక్కులు, ప్రభుత్వ భూముల కబ్జా లాంటి ఎన్నో అక్రమాలు చేసిన నీవు మా నాయకుల గురించి మాట్లాడే అర్హత ఉందా అని ప్రశ్నించారు. నమ్మి నీవెంట వచ్చిన ఆడపడచులను కూడా మోసం చేసిన ఘనుడవు నీవని ఏద్దేవా చేశారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో అందరూ పోటీ చేస్తారని, ప్రజా బలం ఉన్నవారే గెలుస్తారని గుర్తుంచుకోవాలన్నారు. కనీసం కౌన్సిలర్‌గా కూడా గెలవలేని నీవు మానాయకుని పేరు ఉచ్చరించడానికి అర్హత లేదన్నారు. అభివృద్ధి గురించి నీవు చెబుతున్నవన్నీ తప్పుడు మాటలేనని, ఈ విషయం కదిరి ప్రజలందరికీ తెలుసన్నారు. అక్రమాలు, అన్యాయాలు మానేసి, సక్రమంగా ఉండేది నేర్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, రాజశేఖర్ బాబు, శేషు, ఉపేంద్రరెడ్డి, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్షుద్రపూజలు చేయలేదు

- వజ్ర భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న వజ్ర భాస్కర్‌రెడ్డి

కదిరి, నవంబరు17 (ఆంధ్ర జ్యోతి): అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట సమీపంలోని నారాయణ దేవాలయంలో తాను క్షుద్రపూజలు చేయలేదని కేవలం పూజలు మాత్రమే చేశానని, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో అన్నమయ్యజిల్లాకు చెందిన వైసీపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డితో కలి ఆయన మాట్లడుతూ కార్తీక పౌర్ణమిరోజున పూజలు చేయడానికి వెళ్లానని క్షుద్రపూజలు చేయలేదన్నారు. టీడీపీ నాయకులు తనపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. సంపాదించిన దానిలో సేవా కార్యక్రమాలు చేస్తున్నానని పేర్కొన్నారు. తనను ఎవరైనా విమర్శిస్తే నాలుకలుండవని హెచ్చరించారు. తనపై ఆరోపణలు చేసినవారందరికీ ఆ దేవుళ్లే శిక్షిస్తారని అన్నారు.

న్యూస్ బాక్స్...

విద్యార్థి మృతికి కారకులపై చర్యలు తీసుకోండి

కదిరి అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థుల మధ్య జరిగిన గొడవలో హిందూపురానికి చెందిన విద్యార్థి ప్రేమ్‌సాయి మరణించాడని, అతని మృతికి కారకులపై, కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం డీఎస్పీ శివనారాయణస్వామికి వినతిపత్రం అందచేశారు. విద్యార్థి గాయాలతో ఉన్నప్పుడే కళాశాల యజమాన్యం ఆసుపత్రికి తీసుకెళ్లి ఉంటే ప్రాణాలతో బయటపడేవాడన్నారు. యజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఆ విద్యార్థి ప్రాణాలు పోయాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్‌జాన్, విజయ్‌కుమార్, అఖిల్, భానుప్రసాద్, అభిరామ్ పాల్గొన్నారు.

● కళాశాల యాజమాన్యంతో చర్చలు

పుట్టపర్తిరూరల్ : ప్రేమ్‌సాయి మరణానికి కారణమైన పట్టపర్తిలోని కళాశాల యాజమాన్యంతో బాధితుడి తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, పవన్, నాయకులు ఆదివారం చర్చించారు. ప్రేమ్‌సాయి కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రేమ్‌సాయి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. అయితే కళాశాలలో ఛైర్మన్ అందుబాటులో లేరని.. మూడు రోజుల తర్వాత వస్తే మాట్లాడుదామని చెప్పడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆ విద్యార్థిసంఘం నాయకులను, తల్లిదండ్రులను అక్కడి నుంచి పంపించేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



కొత్తచెరువు : సభ్యత్వ నమోదులో మాజీ మంత్రి పల్లె

కొత్తచెరువు / నల్లమాడ , నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొత్తచెరువులోని దర్గావీధిలో ఆదివారం చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి పరిశీలించారు. ఆయన వెంట పట్టణ కన్వీనర్ ఒలిపి శీన, నాయకులు సైకిల్‌షాపు బాబా ఉన్నారు. అలాగే నల్లమాడలో టీడీపీ సభ్యత్వనమోదులో పల్లె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మైలే శివశంకర్, బుట్టినాగభూషణనాయుడు, సలాంఖాన్, పాపారాయుడు, అరవింద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారా రామ్మూర్తికి నివాళి



నారా రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరంరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చంద్రగిరి మాజీ శాసనసభ్యుడు నారా రామ్మూర్తి నాయుడి మృతికి ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం అనంతపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నారా రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● పార్టీ కార్యాలయంలో.. : ధర్మవరం పట్టణంలో టీడీపీ కార్యాలయంలో నారా రామ్మూర్తినాయుడి చిత్రపటం వద్ద పలువురు నివాళులర్పించారు. ఇందులో ధర్మవరం నియోజకవర్గ టీడీపీ నాయకుడు రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య మాజీ ఎంపీపీ సీనియర్ నాయకులు మద్దిలేటి, పరిసే సుధాకర్, నాగుర్ హుస్సేన్, శ్రీశైలం పురుషోత్తం గౌడ్, మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, రాళ్లపల్లి షరీఫ్, మారుతిరెడ్డి, గోసల శ్రీరాములు, రామకృష్ణ, బీబీ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ధర్మవరంరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆశావర్కర్లకు ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహిస్తున్నామని, ఆశావర్కర్లు అధిక సంఖ్యలో హాజరై ఈ ధర్నాను విజయవంతం చేయాలని ధర్మవరం సీఐటీయూ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జేవీ రమణ, ఎస్‌హెచ్‌బాషా మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు సంబంధం లేని పనులు చేయిస్తున్నారని, ఆశావర్కర్ల నియామకంలో రాజకీయ జోక్యం ఉండరాదని, సెలవులు, ప్రమోషన్లు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఏఎన్ఎం పోస్టుల్లో ఆశావర్కర్లకు వేయిటేజీ, కనీసం వేతనం అమలు చేయాలనే డిమాండ్లను నేరవేర్చాలని ఈ ధర్నాను నిర్వహిస్తున్నామన్నారు. కావున ఆశావర్కర్లు ఈ ధర్నాలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆయూబ్‌ఖాన్, సీఐటీయూ మండలకో కన్వీనర్ ఇర్ఫానా, నారాయణమ్మ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తనకల్లు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంకపల్లి గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం జూదమాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,060 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కార్పెంటర్, పెయింటర్ల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరంరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్పెంటర్లు, పెయింటర్స్ సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కారించాలని ధర్మవరం జోనల్ యూనియన్ కార్పెంటర్ అధ్యక్షుడు శివ, ప్రధాన కార్యదర్శి నంజుండాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని కార్పెంటర్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్పెంటర్లు, పెయింటర్లుకు ప్రభుత్వం ఇంటిస్థలాలు కేటాయించాలని, పనులు చేస్తూ మృత్యువాతపడిన కుటుంబీకులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియాతో పాటు బీమా కల్పించి వారి కుటుంబాలకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పెయింటర్ల సంఘం అధ్యక్షుడు గడ్డంరాజు, కోశాధికారి సాయిరాజు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గాండ్లపెంట : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయాధికారి ఫరియాభాను విద్యార్థులకు ఆదివారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున, జిల్లాపరిషత్ ఉపాధ్యాయులు రాజశేఖర్ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలకు పూర్వవైభవం..!

- ఎన్నికల నిర్వహణకు చర్యలు
- త్వరలో షెడ్యూల్
- ఓటరు జాబితా సిద్ధం
- అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను రద్దు చేసింది. దీంతో ఆయకట్టు రైతులు, ఆయా గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు పెత్తనం చెలాయిస్తూ చెరువులో మట్టిదోపిడీ, చేపల అమ్మకాలు ఇష్టారాజ్యంగా చేశారు. చెరువులపై ఇష్టారాజ్యాంగా వ్యవహరించి అందినకాడికి దోచుకున్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సాగునీటి సంఘాలను బలోపేతం చేసేందుకు పూనుకుంది. వాటికి పూర్వవైభవం తేవడంలో భాగంగా సాగునీటి ఎన్నికలు నిర్వహించేందుకు పచ్చజెండా ఊపింది. అసెంబ్లీ సమావేశాల అనంతరం సాగునీటి సంఘాల ఎన్నికల తేదీని ప్రభుత్వం ప్రకటించనుంది.





ధర్మవరం చెరువు (ఫైల్), గొట్లూరు చెరువు (ఇన్‌సెట్లో)

ధర్మవరం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి (చెరువు) సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమైంది. తొలుత ఈనెల 23న ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం కాగా... ప్రస్తుతం శాసనసభ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వం ఆ ఈ ఎన్నికలను వాయిదా వేసింది. త్వరలోనే ఎన్నికల తేదీని ప్రకటిస్తామని రాష్ట్ర జలవనరులశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఓటరు జాబితాను సిద్ధం చేసిన అధికారులు తదితర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మరో నెలలోపే ఈ ఎన్నికలు పూర్తి అవుతాయని అధికారులు అంటున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసుల సంయుక్తంగా ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నుకున్న చెరువు సంఘం ఛైర్మన్, సభ్యులు చెరువుల నిర్వహణ, చెరువు భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడటంతో పాటు, చేపల పెంపకం, ఆయకట్టు రైతులకు పంటలు పెట్టుకునేందుకు నీటి విడుదల తదితర వాటికి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

● వైసీపీ పాలనలో ఇక్కట్లు

వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి ఎన్నికలను రద్దు చేయడంతో ఆయకట్టు రైతులు, ఆయా గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆయా గ్రామాల్లోని వైసీపీ మద్దతు సర్పంచ్‌లు, నాయకులు పెత్తనం చెలాయించారు. ఇష్టారాజ్యంగా చెరువుల్లోని మట్టి, చేపలు అమ్ముకొని.. అందినకాటికి సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సాగునీటి ఎన్నికలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఆ మేరకు అధికారులు ఓటరుజాబితా కసరత్తు, చెరువులకు సంబంధించి వివరాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. చెరువు సంఘాలు మళ్లీ బలోపేతం అవుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● ఎనిమిది చెరువులకు ఎన్నికలు

ధర్మవరం చెరువుతో పాటు మండలంలోని మరో ఏడు గ్రామాల చెరువులకు ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఇందులో ధర్మవరం, గొట్లూరు, రావులచెరువు, సీసీకొత్తకోట, రేగాటిపల్లి, పోతుకుంట, కట్టకిందపల్లి, చింతలపల్లి చెరువులకు సంబంధించి ఆయకట్టు భూముల రైతులతో ఈ ఎన్నికలు జరుగనున్నాయి. ఓటరు జాబితాను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు.

● ఓటర్లు ఎంత మంది

మొత్తం ఎనిమిది చెరువులకు సంబంధించిన సంఘాలకు నిర్వహించే ఈ ఎన్నికల్లో 5,736 మంది ఓటర్లు ఉన్నారు. ధర్మవరం చెరువు పరిధిలో 3,164 , గొట్లూరు చెరువు పరిధిలో 695, రావులచెరువు పరిధిలో 463, సీసీ కొత్తకోట చెరువు పరిధిలో 294, కాటిగానిచెరువు (రేగాటిపల్లి) పరిధిలో 311, పోతుకుంట చెరువు పరిధిలో 278, కట్టకిందపల్లి చెరువు పరిధిలో 244, చింతలపల్లి చెరువు పరిధిలో 287 మంది ఓటర్లు ఉన్నారు.

● అభ్యర్థుల ఎంపికకు కసరత్తు

సాగునీటి సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో అభ్యర్థుల ఎంపికపై కూటమి నేతల కసరత్తు చేస్తున్నారు. వైసీపీ నుంచి పెద్దగా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో కూటమి నేతలు ఎవరిని బరిలోకి దింపాలనే ఆలోచనలో ఉన్నారు. గ్రామాల్లో రోజురోజుకూ ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. ఎన్నికల షెడ్యూల్ కోసం పలువురు కూటమి నేతలు ఎదురుచూస్తున్నారు.

త్వరలోనే ఎన్నికల షెడ్యూల్

ప్రస్తుతం శాసనసభ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 23న జరగాల్సిన ఎన్నికలను ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు వాయిదా వేశాం. త్వరలోనే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ఎన్నికలు నిర్వహిస్తాం. ఇప్పటికే ఓటరు జాబితా, గ్రామాల్లోని ఎన్నికలు జరిగే ప్రదేశాలను గుర్తించాం. ప్రభుత్వం నుంచి ఎన్నికల షెడ్యూల్ రాగానే ఈ ఎన్నికలను నిర్వహించబోతున్నాం.

- గురుప్రసాద్, ఇరిగేషన్ మండల ఏఈ, ధర్మవరం



బత్తలపల్లి : వనభోజనాలు నిర్వహిస్తున్న అనంత రాముడు



ధర్మవరం : కార్తీక వనభోజనంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ఘనంగా కార్తీక వనభోజనాలు

బత్తలపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం వద్ద అనంతలక్ష్మి రాముని తోటలో ఆదివారం అనంత లక్ష్మి ఇంజినీరింగ్ కాలేజి అధినేత అనంతలక్ష్మిరాముడు తన బంధుమిత్రులతో కలసి కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. తన వ్యవసాయ క్షేత్రంలోని ఉసిరి తోటలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. ఈ వనభోజన కార్యక్రమానికి 400 మందికి పైగా హాజరయ్యారు. కార్యక్రమంలో అనంతలక్ష్మి కళాశాల డైరెక్టర్ రమేష్, అయ్యప్ప, చిరంజీవి, సురేంద్రనాయుడు, డాక్టర్ సతీష్, సువర్ణ పాల్గొన్నరు.

● ధర్మవరంరూరల్: పట్టణంలోని పురాతన ఆలయమైన త్రిలింగేశ్వరుని ఆలయం వద్ద ఆదివారం ధాత్రి నారాయణపూజ, హోమం, కార్తీక వనభోజన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు రాఘవశర్మ స్వామి తెలిపారు. ఆలయ సమీంపలోని ఉసిరిచెట్టుకు పూజలు చేశారు.



పట్నం పాఠశాలలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



మిట్టపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమావేశం

కదిరి అర్బన్/ఓబుళదేవరచెరువు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కదిరి మండలంలోని పట్నం జిల్లాపరిషత్ పాఠశాలలో 2006-07లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే ఓబుళదేవరచెరువు మండలంలోని మిట్టపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2012-13లో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు.

రథోత్సవానికి పటిష్ట బందోబస్తు



బందోబస్తును పరిశీలిస్తున్న డీఎస్పీ

పుట్టపర్తిరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాల ప్రారంభంలో నిర్వహించే వేణుగోపాలస్వామి రథోత్సవానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం అర్బన్ సీఐ సునీత, సిబ్బందితో కలసి గణేష్ కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండ్, గణేష్ గేట్ నుంచి గోపురం గేట్, సత్యమ్మ దేవాలయం వరకు నిర్వహించాల్సి బందోబస్తు ఏర్పాట్లను డీఎస్పీ పరిశీలించారు. రథోత్సవం సందర్భంగా ఎటువంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అర్బన్ సీఐకి సూచించారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

ఓబుళదేవరచెరువు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాస్తవాలు వెలికి తీసిన విలేకరి పట్ల అనుచితంగా ప్రవర్తించిన నల్లచెరువు హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానకంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్మీనారాయణ ఎక్కడ విధులు నిర్వహించినా.. విద్యార్థుల పొట్ట కొట్టడమే తప్ప.. కడుపు నిండా అన్నం పెట్టిన పాపాన పోలేదన్నారు. రెండునెలల క్రితం మండలంలోని గౌనిపల్లి ఇన్‌చార్జ్ వార్డెన్‌గా విధులు నిర్వహించిన సమయంలో కూడా విద్యార్థులకు సౌకర్యాలు కల్పించలేదన్నారు. అప్పటిలో అతనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో బదిలీ చేశారన్నారు. ఇలాంటి అక్రమాల వార్డెన్ వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చలపతినాయుడు, రైతు సంఘం జిల్లా నాయకులు పూల శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

హోటల్‌లో మద్యం సేవిస్తే చర్యలు

ఓబుళదేవరచెరువు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హోటల్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ బి. మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక అన్ని హోటల్‌ను ఆయన తనిఖీ చేశారు. హోటల్ యజమానులు కూడా హోటల్‌లో మద్యం తాగనివ్వకూడదని, అలాకాదని తాగనిస్తూ తాగినవారితో పాటు హోటల్ యజమానులపై చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది సాయి, ప్రతాప్, హోమ్‌గార్డు నాగిరెడ్డి ఉన్నారు.

వైసీపీ సైకోలపై చర్యలు హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

కదిరి అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సోషియల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతూ పైసాచిక ఆనందనం పొందుతున్న వైసీపీ సోషియల్ మీడియా సైకోలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమని జనసే నాయకులు పేర్కొన్నారు. ఆదివారం రోడ్డు భవనాల అతిథి గృహంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం, నాయకులపైనే కాకుండా వారికుటుంబ సభ్యులపైన కూడా సోషియల్ మీడియాలో కించపరిచేలా పోస్టులు పెట్టడం హేయమైన చర్యన్నారు. కార్యక్రమంలో జనసేన భైరవప్రసాద్, శివశంకర్, చలపతి, చిన్నప్పరెడ్డి, లక్ష్మణ్, రమణ, రాజేంద్రప్రసాద్, చౌదరి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు, విద్యార్థులు

మృతులకు నివాళి

ధర్మవరంరూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టణానికి చెంది వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్, అతని కుమార్తె సాయిభవిత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెల్సిందే. ఈ మేరకు ఆదివారం యూటీఎఫ్, పదో తరగతి విద్యార్థులు పట్టణంలోని బాలుర ప్రభుత్వ పాఠశాల మైదానంలో బాస్కెట్‌బాల్ ఆవరణంలో సంతాపసభ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, రాయపాటి రామకృష్ణ, జయం రాఘవ, కేశగాళ్ల రంజిత్‌కుమార్, సాకే రవికుమార్, అన్నం మల్లికార్జు, యూటీఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, వెంకట కిశోర్, శ్రీనివాసులు, నారాయణస్వామి పాల్గొన్నారు.

గొరవనహళ్లిలో భక్త కనకదాస జయంతి



జ్యోతులు మోస్తున్న మహిళలు

పరిగి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గొరవహనహళ్లి గ్రామంలో కురుబ కులస్థులు భక్త కనకదాస జయంతి వేడుకల్లో భాగంగా మహిళలు మైలారలింగేశ్వరస్వామి ఆలయం వరకు జ్యోతులు మోసి ఆదివారం కనకదస చిత్రపటానికి అర్పించారు. కార్యక్రమంలో కురుబ కులస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాల్లో వెలుగు నింపాలి

పెనుకొండ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : ఈనెల 22న విజయవాడ విద్యుత్ సౌధలో జరిగే హెచ్ఆర్ కమిటీ సమావేశంలో తమ సమస్యలు పరిష్కరించి, కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతరావు విజ్ఞప్తిచేశారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో మొట్టమొదటగా విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి దానిని తుంగలో తొక్కి మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసిన హెచ్ఆర్ కమిటీ 25వేల విద్యుత్ కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపుతుందన్న ఆశతో ఉన్నామన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా తెలంగాణ, తమిళనాడు విధానాలను పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారన్నారు.

వైభవంగా కవుల సమ్మేళనం



చర్చావేదికలో వక్తలు

మడకశిరటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ 57వ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రంథాలయంలో కవుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చర్చావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు రాష్ట్రానికి చెందిన నన్నయ, తిక్కన, ఎర్రన, తోపాటు పలువురు రచయితలతోపాటు వారి సందేశాలను విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయంలో కవులు రచించిన పుస్తకాలు చదవడం వల్ల ఎంతో జ్ఞానం పెరుగుతుందని, పోటీ పరీక్షలకు సైతం ఉపయోగపడతాయని అన్నారు. ఈసందర్భంగా గ్రంథాలయ ఇన్‌చార్జి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక పరికరాలతో మెరుగైన సేవలు



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తాము ఎప్పుడు ముందుంటామని చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ ఆర్. శ్రీనివాసనాయక్, దంత చికిత్స వైద్యనిపుణులు డా. కె. భారతిలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని ఆర్‌పీజీటీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనివాస స్కిన్, డెంటోకేర్ యూనిట్లను ఘనంగా ప్రారంభించారు. చర్మవ్యాధులు, వెంట్రుకలు ఊడిపోవుట, మొటిమలు తదితర వ్యాధులకు, సుఖవ్యాధులకు, రూట్‌కెనాల్, ఫిక్స్‌డ్ పళ్లు, చిగుళ్ల వాపు తదితర వ్యాధులకు అత్యాధునిక చికిత్సలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పూజలు వైభవంగా చేశారు.

చిన్నారులకు బాలకళారత్న అవార్డులు

అనంతపురం కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన చిన్నారులను బాలకళారత్న అవార్డులు వరించాయి. సాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గుంటూరు బృందావన గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికలో ఈనెల 14 నుంచి 16 వరకు నృత్య కళాపోటీలు నిర్వహించారు. మొదటిరోజు సీనియర్స్ రెండో రోజు సబ్‌జూనియర్స్, మూడో రోజున జూనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి ఆదివారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ నేపథ్యంలో అనంత పురం నగరానికి చెందిన గురుకృప సంగీత నృత్యకళానిలయం నాట్యాచార్యుడు పట్నం శివప్రసాద్ శిష్య బృందం సీనియర్స్ విభాగంలో లాలిత్య, దేవీ చందన, సబ్ జూనియర్స్ విభాగంలో మయూఖశ్రీ, వైదూర్య, జస్విని‌లు గెలుపొందగా జూనియర్స్ విభాగంలో రిషిక‌శ్రీ, మహతి మనోజ్ఞ గెలుపొందారు.

వైభవంగా ఉజ్జినప్ప స్వామి పెద్దఉరుసు



ఉజ్జినప్ప స్వామిని దర్శించుకుంటున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హనుమప్పల్లి గ్రామంలో కురుబ కులస్థులు వైభవంగా ఉజ్జనప్పస్వామి పెద్దఉరుసు మహోత్సవం నిర్వహించారు. ఆదివారం గ్రామంలో కురుబ కులస్థులు గుడికట్లు అంతా కలిసి గ్రామంలో వెలసిన ఉజ్జనప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పాల్గొని ఉజ్జనప్పస్వామిని దర్శించి గుడికట్లుతో కలిసి చర్చించారు. వచ్చిన కురుబ కులస్థులకు అన్నదానం నిర్వహించారు.

కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణించాలి

పెనుకొండ రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రహదారుల్లో ప్రయాణించేటపుడు కుటుంబాలను దృష్టిలో పెట్టుకోవాలని కియ ఎస్ఐ రాజేష్ వాహనదారులకు సూచించారు. ఆదివారం అమ్మవారిపల్లి, గుట్టూరు, హరిపురం వైజంక్షన్‌లలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా వాహనాలు నడపం వలన జరిగే అనర్థాల గురించి వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీడీ మీటింగ్‌కు హాజరు

పశువులకు బేజారు



తలుపులు తెరుచుకోని కల్లుమర్రి పశువైద్యశాల

- బోర్డు చూసి వెనక్కివెళ్తున్న పాడిరైతులు
- ఇదీ కల్లుమర్రి పశువైద్యశాల పరిస్థితి

మడకశిర రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో డీడీసార్ మీటింగ్ ఉందంటే మండలంలో పశువులన్నీ బుద్ధిగా మసలుకోవాలి. రోగాలు, జ్వరాలు తెచ్చుకోకూడదు. కాదూ కూడదు అని రోగాలు తెచ్చుకుని ఆసుపత్రిదాకా వస్తే అక్కడ ఎవరూ ఉండరు. మందులు లేకుండా జ్వరంతో తిరిగి వెళ్లాల్సిందే. మండలంలో ప్రస్తుతం పశువులలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గొర్రెలు గాలికుంటు వ్యాధితో బాధపడుతుండగా, ఆవులు, బర్రెలు జ్వరాలతోనూ, లంప్ స్కిన్ వ్యాధితో ఇబ్బందిపడుతున్నాయి. వాటికి వైద్యం చేయాల్సిన గోపాలమిత్ర డీడీ మీటింగ్ ఉందంటూ బోర్డు తగిలించి వెళుతున్నారు. పాపం! పశువులకు ఈ రాజకీయాలన్నీ తెలియవాయె. ఎంతో కష్టపడి గంపెడాశతో రోగంతో ఆసుపత్రికి వచ్చిన పశువులు సిబ్బంది అక్కడ తగిలించిన బోర్డు చూసి ఉసూరోమని వెనుతిరిగి వెళుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారుల్లో మాత్రం చలనం కన్పించడంలేదు. ఏడికి గాని, డీడీకి గాని మూగజీవుల బాధలు తెలియవా? వారిఇంట్లో ఎవరికైనా అనారోగ్యం వస్తే ఎలా పరుగెత్తుతారు? ఇప్పటికైనా ప్రత్యామ్నాయచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



డీడీ మీటింగ్ ఉందంటూ తగిలించిన బోర్డు

గోపాలమిత్రతో నిర్వహిస్తున్నాం: అమర్, వెటర్నరీ ఏడీ

మండలంలో పశువైద్యశాలకు డాక్టర్లు లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కల్లుమర్రిలో పశువుల డాక్టర్ లేని కారణంగా అక్కడ గోపాలమిత్ర సేవలను ఉపయోగించుకొంటున్నాం. ఆయన సెలవులో ఉన్నారు.

పశువైద్యశాలకు డాక్టర్‌ను నియమించండి

ఐదు సంవత్సరాలుగా మా పశువైద్యశాలకు డాక్టర్ లేడు. గ్రామ సభల్లో పశువైద్యశాలకు డాక్టర్లను నియమించాలని వినతి పత్రాలు కూడా ఇస్తునే ఉన్నాం. ఇప్పటికే సకాలంలో వైద్య సేవలు అందక అనేక పశువులు మృత్యువాతన పడ్డాయి. ఉన్న పశువైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి గత టీడీపీ ప్రభుత్వంలో నూతన భవనాలు కోసం రూ.30 లక్షలు నిధులు కూడా మంజూరైనాయి అప్పట్లో ప్రభుత్వం మారడంతో ఆ నిధులు కాస్తా వెనక్కి వెళ్ళాయి. ఇప్పటికైనా సంబందింత ఉన్నతాధికారులు తగు చర్యలుకోవాలని కోరుతున్నాం .

-నారాయణప్ప, శేఖర్, రామాంజనేయులు, రైతులు, కల్లుమర్రి

నరకప్రాయం.. బురద రోడ్లలో ప్రయాణం

పెనుకొండ రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్ల నుంచి పెనుకొండ నుంచి కోనాపురం, మంగాపురం వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ రహదారిలో ప్రయాణం మరింత నరక ప్రాయంగా మారింది. 2020-21 సంవత్సరంలో పెనుకొండ నగర పంచాయతీ చుట్టుపక్కల గ్రామాలైన వెంకటరెడ్డిపల్లి, ఇస్లాపురం, కోనాపురం, మంగాపురం నగర పంచాయతీలో విలీనమయ్యాయి. నగర పంచాయతీలో విలీనం అయినప్పటికీ గ్రామాల్లో ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెనుకొండ నగర పంచాయతీ కాకముందు ఈ గ్రామాలకు సర్పంచులుండేవారని, సమస్యలను సర్పంచులకు వివరిస్తే వారు కొద్దిరోజుల్లోనే సమస్యలు పరిష్కరించేవారన్నారు. తాము పెనుకొండ నగర పంచాయతీలో కలిసి నాలుగేళ్లు కావస్తున్నా గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు తదితర మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించి పెనుకొండ నుంచి కోనాపురం వెళ్లే గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన మంగాపురం రహదారి

వైభవంగా కనకదాస విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కురుబ కులస్థులు

హిందూపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : హిందూపురం మండలంలోని తుంగేపల్లి గ్రామంలో ఆదివారం కురుబల ఆరాధ్యదైవం భక్తకనకదాసు విగ్రహాన్ని వైభవంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గొరవయ్యల నృత్యప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కురుబ కులానికి చెందిన మహిళలు పెద్దఎత్తున జ్యోతులతో ర్యాలీగా వెళ్లి కనకదాస విగ్రహానికి అర్పించారు. ఈ సందర్భంగా కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ కురుబ కులస్థులు విద్య, రాజకీయ, ఆర్థికంగా వృద్ధి సాధించాలన్నారు. ముఖ్యంగా కురుబ కులస్థులు అడిగిన వెంటనే విగ్రహానికి, కురుబ సామాజికవర్గానికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మయ్య, ఐటీడీపీ రామాంజినేయులు, వీరశేఖర్, రామక్రిష్ణ, చిక్కీరప్ప, మూర్తి, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాల్మీకి జయంతి

అమరాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండలంలోని హలుకూరు గ్రామంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి తీర్థప్రసాదాన్ని పంచిపెట్టారు. వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల మీదుగా డీజేసౌండ్‌సిస్టంతో మేళ తాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, వాల్మీకి యువక సంఘం సభ్యులు హిమంతరాజు, నాగరాజు, సిద్దేశ్వర, రమేష్, మాజీ సర్పంచి ప్రకాష్, పంచాయతీ కన్వీనర్ చెన్నబసప్ప, నాగభూషణ, ఉదుగూరు రాజప్ప, మారుతీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి జయంతిలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి పాండురంగప్ప, బీసీ సెల్ తాలూకా ఉపాధ్యక్షులు మంజుతారక్, ఈరన్న, పాల్గొన్నారు.

వైభవంగా శనైశ్వర విగ్రహ ప్రతిష్ఠ

మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామంలో నిర్మించిన నూతన దేవాలయంలో ఆదివారం శ్రీ మహాగణపతి, శనైశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు దీక్ష హోమం, నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రతిష్ఠాహోమం, కుంభాభిషేకంజరుపుతామని తెలిపారు.

సత్యనారాయణస్వామి పూజలో..

రొళ్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం దొడ్డలింగప్ప స్వగృహంలో నిర్వహించిన సత్యనారాయణస్వామి పూజకు మాజీ ఎమ్మెల్సీ గుండుమల హాజరయ్యారు. అనంతరం హనిసేకుంట గ్రామంలో వక్కలిగ రాష్ట్ర డైరెక్టర్ ముదుపేగౌడ్ మనవడి నామకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రారంభంకాని లేపాక్షి తూర్పుద్వారం

- వృద్ధులు, దివ్యాంగులకు తప్పని ఇబ్బందులు

లేపాక్షి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గా, వీరభద్రస్వామి ఆలయం ప్రపంచ నలుమూలల నుంచి ఎంతో ప్రసిద్ధిచెందింది. ఆలయాన్ని సందర్శించడానికి విదేశాల నుంచి సైతం భక్తులు విచ్చేస్తుంటారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో లేపాక్షి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగడంతో భక్తుల సంఖ్య, పర్యాటకుల సంఖ్య వేలల్లోకి చేరుకుంది. ఇంతటి ప్రసిద్ధిచెందిన ఆలయాన్ని సందర్శించడానికి వచ్చే వికలాంగులు, వృద్ధులు, చిన్నారులు, ఆలయం మెట్లు ఎక్కాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని గుర్తుంచుకుని కేంద్ర ప్రభుత్వం పురావస్తుశాఖ ఆధ్వర్యంలో తూర్పుద్వారాన్ని ఏర్పాటు చేసింది. ఆ ద్వారం గుండా వెళ్లడానికి వృద్ధులకు, వికలాంగులకు, చిన్నారులకు చెక్కతో ర్యాంప్‌ను ప్రత్యేకంగా తయారు చేయించారు. రెండు వీల్ చైర్లను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించింది. అయితే ఇప్పటి వరకు తూర్పు ద్వారాన్ని మనుగడలోకి తీసుకురాలేదు. గుత్తేదారుడు సక్రమంగా రోప్‌ను నిర్మించారా, వీల్‌చైర్‌లు సిద్ధం చేశాడా? లేదా? అంటూ గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. మరోవైపు ఆలయానికి వచ్చిన వికలాంగుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం, ఉన్నతాధికారులు వారికి సౌకర్యాలు కల్పించాలని, తూర్పు ద్వారాన్ని మనుగడలోకి తీసుకురావాలని, అందువలన ఇబ్బందులు తొలగుతాయని పర్యాటకులు అంటున్నారు.



నిరుపయోగంగా ఉన్న తూర్పు ద్వారం



దివ్యాంగుడిని మోసుకెళ్తున్న దృశ్యం

విద్యార్థుల కోసం అపార్ సెంటర్లు

మడకశిర రూరల్, నవంబరు 17 :(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం అపార్ ఆధార్ ప్రత్యేక సెంటర్లను ఏర్పాటుచేసినట్లు ఎంఈఓలు భాస్కర్,నరసింహమూర్తిలు తెలిపారు. మడకశిర ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల, ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసినట్లు కేంద్రాలను వారు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామ్మూర్తినాయుడు అంత్యక్రియల్లో ఎమ్మెల్యే

మడకశిరటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు అంత్యక్రియల్లో మడకశిర ఎమ్మెల్యే టీటీడీ బోర్డు సభ్యులు ఎం.ఎస్.రాజు పాల్గొన్నారు. సినీ హీరో నారారోహిత్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి లోకేష్‌తోపాటు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్తీక మాస పూజలు ప్రారంభం



ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

అమరాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మడేపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ శివచిత్ర లింగేశ్వర స్వామి దేవాలయం, ఎత్తప్ప స్వామి దేవాలయంలో కార్తీక మాస పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు శివలింగయాదవ్, మల్లికార్జునలు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున గంగాపూజ, కలశ స్థాపన, ధ్వజారోహణం, ఉదయం నవగ్రహపూజ, పంచకలశ పూజ, పంచామృతాభిషేకం, వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 19న విశేష పూజా కార్యక్రమాలతోపాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు శివలింగప్ప, మల్లికార్జున తదితరులు తెలిపారు.

కన్నడాంబ రథోత్సవానికి ఘన స్వాగతం

పావగడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న 87వ కన్నడ సాహిత్య పరిషత్ సమ్మేళన రథోత్సవానికి ఆదివారం పావగడలో ఘనస్వాగతం పలికారు. భువనేశ్వరి చిత్రపటం, కన్నడసాహిత్య పరిషత్ రచయితల చిత్రపటాలతో కూడిన రథోత్సవం శిరా తాలూకా నుండి పావగడకు వస్తున్న సందర్భంగా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కట్టానరసింహమూర్తి, ఆర్.టి.ఖాన్, కార్యకారి సమితి సభ్యులు పెద్దఎత్తున స్వాగతం పలికి కన్నడ భాష పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకొన్నారు. నేడుఊరేగింపుగా మధుగిరికి తరలివెళ్లనున్నట్లు నరసింహమూర్తి తెలియజేశారు.

కనకదాస జయంతిని జయప్రదం చేయండి

పెనుకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీభక్తకనకదాస 537వ జయంతోత్సవాన్ని జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీకార్యాలయంలో కురుబ కులస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం అనంతపురంలోని కేటీఆర్ ఫంక్షన్‌హాల్‌లో అధికారికంగా శ్రీభక్త కనకదాస జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

కొనసాగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు

పెనుకొండ రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీ ఇస్లాపురం గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో మండల కన్వీనర్ శ్రీరాములుయాదవ్, కౌన్సిలర్ గీత హనుమంతు, తదితరుల ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆదివారం ఒక్కరోజే 200మంది సభ్యత్వ నమోదు చేయించుకున్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే బాధితులకు రూ.5లక్షల బీమా సౌకర్యంను కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు. దీంతో ప్రతి ఒక్కరూ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్యత్వ నమోదు చేయించుకోవాలని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం - ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యంతో పోలీసులు

మడకశిరటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మడకశిర ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి మద్యం స్వాధీనం చేసుకొన్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అలీబేగ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా గుడిబండ మండలం కేకాతికి చెందిన ఆర్. లింగరాజు వద్ద 96 ఒరిజినల్‌ఛాయిస్ కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. అదేవిధంగా మడకశిర పట్టణంలోని వై.బి.హళ్లి క్రాస్ వద్ద కర్ణాటకకు చెందిన జి.ఎం.నంజప్ప వద్ద 103 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

సదుపాయాల కల్పనలో ఎస్ఎస్‌కే విఫలం

పావగడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక శనైశ్చరస్వామి ఆలయంలో మౌలిక సదుపాయాలను భక్తులకు కల్పించడంలో ఎస్ఎస్‌కే సంఘం కార్యనిర్వాహకులు విఫలమవుతున్నారని ప్రముఖ రైతు నాయకులు రాష్ట్ర కిసాన్ సంఘం అధ్యక్షుడు నాగభూషణరెడ్డి విమర్శించారు. విలేకరుల సభలో ఆయన మాట్లాడుతూ.. 20 ఏళ్ల నుంచి ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ రానురాను పెరుగుతోందని, వేసవి కాలంలో భక్తులు ఎండలోనే క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకొనే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన తెలిపారు. ఆలయ ప్రాంగణం లోపల పురాతన విగ్రహాలు, వెనకభాగంలో పైకప్పు శిథిలమవుతున్నప్పటికీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులుకానీ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన తెలియజేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఫ్లైఓవర్ ఏర్పాటు చేయడంతోపాటునిత్యాన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఆయన తెలియజేశారు. లేనిపక్షంలో ఎస్ఎస్‌కే కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేసి ధర్నా చేపడుతున్నట్లు ఆయన హెచ్చరించారు.

గ్రంథాలయ వారోత్సవాలు

అమరాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగురాష్ట్రానికి చెందిన నన్నయ, తిక్కన, ఎర్రన, మల్లన్న తదితర రచయితల గురించి వారి సందేశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు మాలింగప్ప, యోగామాస్టర్ కిశోర్, మహంతేష్, గ్రంథాలయ అధికారి ఇబ్రహీం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రొళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో బి.జి.హళ్లి, మల్లినమడుగు, ఎం.రాయాపురం, హొట్టేతిమ్మనహళ్లిలలో సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రొళ్ల ఏఈ నిజాముద్దీన్ తెలిపారు. దీనిని రైతులు గమనించాలని కోరారు.

నేడు లక్షదీపోత్సవం

రొళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళికాంబ కమటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం నుండి లక్షదీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు ప్రకాష్‌ఆచార్ తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రిని కలిసిన వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్

సోమందేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన డీవీ ఆంజనేయులు బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితను ఆమె స్వగృహంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సోమందేపల్లికి చెందిన పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి అన్నదానం

హిందూపురం అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బెంగళూరు రోడ్డులో నెలకొన్న శ్రీ అయ్యప్ప ఆలయంలో సోమవారం నుంచి అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు అయ్యప్ప అన్నదాన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కరపత్రాలు విడుదల చేశారు. మాలధరించిన భక్తుల సౌకర్యార్థం 45 రోజుల పాటు ప్రతిరోజు మధ్యాహ్నం అన్నదానం చేయనున్నామన్నారు.